క్లుప్తంగా

విద్యార్థులకు ఆర్థికసాయం



విద్యార్థులకు సాయం అందజేస్తున్న సభ్యులు

కడప కల్చరల్: కడప నగరానికి చెందిన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు విద్యార్థుల చదువులకుగానూ బుధవారం ఆర్థికసాయం అందజేశారు. రేణిగుంట బాలాజీ మెడికల్ కళాశాలలో మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతున్న లోకేష్‌కు సెమిస్టర్ ఫీజు కోసం రూ.30 వేలు, కడప విజయదుర్గ నర్సింగ్ కళాశాలలో చదువుతున్న సౌభాగ్యకు రూ.20 వేలు బాసట సేవా సంస్థ అందజేసింది. దాతలు డీఈ.కార్తీక్‌రెడ్డి, ధరణిజలు రూ.39,768, దాతలు రూ. 10,232 ఆ మొత్తం విరాళంగా ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు. కార్తీక్‌రెడ్డి దంపతులు మాట్లాడుతూ చదువుల్లో రాణించే విద్యార్థులకు బాసట సహకారం తప్పక ఉంటుందన్నారు. కార్యక్రమంలో మేరువ బాలాజీ రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

కడప వైఎస్ఆర్ సర్కిల్: అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురు వారం ఉదయం 11 గంటలకు తమ కార్యాలయ ఆవరణంలో వేలం జరుగుతుందన్నారు.

బోర్లను మరమ్మతు చేయాలి

కడప ఎడ్యుకేషన్: నగరంలోని 27వ డివిజన్ గౌస్‌నగర్ మసీదు ఎదురుగా బోరు పాడైందని, వెంటనే మరమ్మతులు చేయాలని జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్ బాషా కోరారు. గౌస్‌నగర్ బోర్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి కొరత ఎక్కువగా ఉండడంతో గౌస్‌నగర్ వాసులు ఇబ్బంది పడుతున్నారన్నారు. నాలుగు బోర్లు పాడై నీటి కొరత అధికంగా ఉందన్నారు. అధికారులు స్పందించి ముందస్తుగా బోర్లకు మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో అమానుల్లాషేక్, షఫీ ఉల్లా, నారాయణ తదితరులు పాల్గొన్నారు

ఏప్రిల్ 4న ప్రభుత్వ మహిళా కళాశాల వార్షికోత్సవం

కడప ఎడ్యుకేషన్: పట్టణంలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏప్రిల్ 4వ తేదీన కళాశాల వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలను స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు స్టూడెంట్ యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్య అతిథిగా కడప జిల్లా ఎస్పీ శ్రీ ఈజీ.అశోక్‌కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ హాజరవుతారని తెలిపారు. అత్యధిక మార్కులతో ప్రతిభ చూపిన విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీలో ఉత్తమ సేవలందించిన వారికి జ్ఞాపిక, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు.



డాక్టర్ సలీంబాషా

ఎనర్జీ క్లబ్స్ ఏర్పాటు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ కింద కడప జిల్లాలో ఎనర్జీ క్లబ్ ఏర్పాటు చేసేందుకు 36 పాఠశాలలు ఎంపిక చేశారు. బుధవారం కడప బాలికల హైస్కూల్‌లో ఎనర్జీ క్లబ్స్ ఏర్పాటు చేసి పిల్లలకు సదస్సు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పిల్లలలో ఎనర్జీ కన్సర్వేషన్ గురించి అవగాహన కల్పించడానికి ప్రతి స్కూల్‌కు ఏపీఎస్‌సీఎం డిపార్టమెంట్ ద్వారా రూ.10000 రూపాయిలు అందిస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి షర్మిలా0 రాణి, మంజులత పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

కమలాపురం : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3, 4 తేదీల్లో చిన్నచెప్పలి, ఎర్రగుడిపాడు గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. 5వ తేదీ పెద్దచెప్పలి, నల్లింగాయపల్లెలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే 8వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు కమలాపురం-1, కమలాపురం -2, పందిళ్లపల్లె, జంభాపురం గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆధార్‌లో పుట్టిన రోజు, చిరునామా మార్పులు ఉంటే చేసుకోవాలని సూచించారు. ఆయా కార్యాయాలకు వెళ్లి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

కడప బోటింగ్ యూనిట్‌కు మంగళం

నగర వాసులకు 17 ఏళ్లపాటు ఆహ్లాదాన్ని అందించిన పాత కడప బోటింగ్ యూనిట్‌కు మంగళం పాడినట్లయింది. మార్చి 30వ తేదీన ఈ యూనిట్‌లో ఉన్న ఒక్క బోటును పార్నపల్లె యూనిట్‌కు తరలించారు. దీంతో బోటింగ్ కోసం వసతుల కల్పనకు చేసిన కోట్ల రూపాయల ఖర్చు బూడిదలో పోసిన పన్నీరైంది. వివరాలిలా ఉన్నాయి.



దేవునికడప బోటింగ్ యూనిట్‌లో ఉపయోగపడని బోట్లు

కడప కల్చరల్: పాత కడప బోటింగ్ యూనిట్ మూత పడింది. ఇక్కడ కొద్ది కాలంగా ఉన్న ఒక్క బోటును పార్నపల్లె బోటింగ్ యూనిట్‌కు తరలించడంతో కడప యూనిట్‌లో ఒక్క బోటు కూడా లేదు. పార్నపల్లె యూనిట్‌లో మూడు బోట్లు నడుస్తుండగా, ఒక దానిని కర్నూలు గార్గేయపురం బోటింగ్ యూనిట్‌కు తరలించారు. దాని స్థానంలో కడపలో ఉన్న బోటును పార్నపల్లెకు తీసుకెళ్లారు. కడప యూనిట్‌లో ఉండిన ఉద్యోగిని పార్నపల్లెకు తరలించడంతో ఇక్కడి యూనిట్‌లోని వసతులన్నీ ఉపయోగంలో లేకుండాపోతున్నాయి. 17 ఏళ్ల తర్వాత యూనిట్‌కు మంగళం పాడినట్లైంది.

ఆహ్లాదం పంచాలని...

2008 ద్విశతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆనాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరెడ్డి కడప నగర వాసులకు ఆహ్లాదం పంచాలనే ఉద్దేశ్యంతో పాత కడప చెరువును బోటింగ్ యూనిట్‌గా మార్చారు. ఆ తర్వాత రూ. 10 కోట్లు ఖర్చుచేసి చెరువులో శాశ్వతంగా నీరు నిల్వ ఉండేలా వసతులు కల్పించారు. మూడు బోట్లను అందుబాటులో ఉంచారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు పార్నపల్లె బోటింగ్ యూనిట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కడప యూనిట్‌లో కేవలం ఒక్క బోటు మాత్రమే మిగిలి ఉండగా, దాన్ని పార్నపల్లెకు తరలించడంతో ఇక్కడ షికారుకు ఒక్కబోటు అందుబాటులో లేకుండా పోయింది. బ్రహ్మోత్సవాల నాటికి ఒంటిమిట్టకు బోట్లు రావడం అటుంచితే, 17 సంవత్సరాలపాటు కడప యూనిట్‌లో నగర వాసులకు ఆహ్లాదాన్ని పంచిన బోటు అందుబాటులోలేకపోవడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో నగర వాసులకు బోటింగ్ ఆహ్లాదాన్ని దూరం చేశారని పలువురు ప్రజలు పేర్కొంటున్నారు.

పర్యాటకులకు నిరాశ

ఇటీవల ప్రభుత్వ పెద్దలు ఒంటిమిట్టను పర్యాటకంగా అభివృద్ధి చేసే విషయం మాట్లాడుతూ ఒంటిమిట్ట రామయ్య బ్రహ్మోత్సవాల సందర్భంగా బోటింగ్ యూనిట్ ఏర్పాటుచేయాలని భావిస్తున్నట్లు ప్రకటించారు. అప్పుడప్పుడూ ఇలా బ్రహ్మోత్సవాలకు కడప యూనిట్ నుంచి బోట్లను ఒంటిమిట్ట చెరువు యూనిట్‌కు పంపేవారు. ఇంతవరకూ ఒంటిమిట్ట యూనిట్‌కు కొత్త బోట్ల విషయంలో కదలిక లేదు. అందుబాటులో ఉండే కడప యూనిట్ బోట్లను ఇతర ప్రాంతాలకు పంపారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు మరో మూడు రోజుల్లో ప్రారంభం కావాల్సి ఉండగా, ఆ యూనిట్‌కు వచ్చే పర్యాటకుల ఆశలు సన్నగిల్లుతున్నాయి.

6 నుంచి నడివీధి గంగమ్మ ఆలయ వార్షికోత్సవం

కడప కల్చరల్: కడప హనుమప్ప వీధిలోని నడివీధి గంగమ్మ క్షేత్రం వార్షికోత్సవం ఈ నెల 6 నుంచి ప్రారంభం కానుందని క్షేత్ర నిర్వాహకులు గోపాల్ సింగ్ తెలిపారు. విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఈ నెల 6న చల్ల కార్యక్రమం నిర్వహిస్తామని, ఉదయం 9.30 గంటలకు నాగులకట్ట వద్ద శివ లింగ ప్రతిష్ఠ, సాయంత్రం 6.30 గంటలకు పల్లకీ సేవ ఉంటుందన్నారు. ఉంటుందని తెలిపారు. 7న ఉదయం 7 గంటలకు క్షీరాభిషేకం, 10 గంటలకు రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. 8న ఏకాదశి సందర్భంగా ఉదయం 8 గంటలకు రుక్మిణి పాండురంగస్వామి ఆలయం వద్ద నుంచి 108 పవిత్ర జలాలున్న కలశాలతో అభిషేకం, చిన్నచౌకవీది, బాల పోలేరమ్మగుడి, హబీబుల్లావీధి, పొట్టిశ్రీరాములు వీధి, అమ్మవారిశాల, భద్రావతి భవనాల రుషి ఆలయాల మీదుగా ఊరేగింపు ఉంటాయన్నారు సాయంత్రం 3 గంటలకు రాహు కాల పూజ, రాత్రి 7.30 గంటలకు మహామంగళ హారతి ఉంటాయన్నారు. 9న ఉదయం 10 గంటలకు గాజుల అలంకారం, సాయంత్రం 6 గంటలకు గోమాతకు సీమంతం, 10న ఉదయం 10 గంటలకు 108 మంది బాలకుమారీలచే అమ్మవారికి బాల త్రిపురసుందరీదేవి అలంకారం, తాంబూల ప్రదానం, సాయంత్రం 5 గంటలకు వడిబియ్యం ప్రదానం ఉంటాయన్నారు. 11న ఉదయం 6 గంటలకు అభిషేకం, పూజ, సాయంత్రం 6 గంటలకు సహస్ర నామ పారాయణం, అనంతరం 108 నాణేలతో కుంకుమార్చన ఉంటాయన్నారు. 12న గ్రామోత్సవం, 13న వసంతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 14న మధ్యాహ్నం మహానైవేద్యం అందజేయనున్నట్లు తెలిపారు.

7న కలెక్టరేట్ వద్ద సామూహిక నిరాహార దీక్ష



మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ

కడప వైఎస్ఆర్ సర్కిల్: పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ఈ నెల 7న సామూహిక నిరాహార దీక్ష చేపడుతున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి యస్.వెంకటశివ పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన నగర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప నగర సమగ్రాభివృద్ధికి పాలక ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని సీపీఐ ఉద్యమం చేపట్టిందన్నారు. తొమ్మిది నెలల కూటమి ప్రభుత్వ పాలనలో నగర అభివృద్ధికి ఇంతవరకూ ఏ విధమైన నిధుల కేటాయింపులు లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. కుర్చీల కుమ్ములాటలో నగరాభివృద్ధి అంశాలపై నగరపాలక జనరల్ బాడీ సమావేశంలో చర్చలు జరపకుండా, సమావేశాలు సక్రమంగా నిర్వహించకుండా మొక్కుబడిగా స్టాండింగ్ కౌన్సిల్ నిర్వహించుకుంటూ మమ అనిపిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, అధిక ధరలు, పన్నుల భారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తొమ్మిది నెలల కూటమి పాలనలో పింఛన్ల పంపిణీ మినహా మరో ఏ ఇతర సంక్షేమ కార్యక్రమం లేదన్నారు. ఎన్నికలప్పుడు కూటమి ప్రభుత్వం చెప్పిన మూడు సెంట్లు, రెండు సెంట్ల ఇళ్ల స్థలాలకు సంబంధించిన అర్జీల స్వీకరణ, విచారణ, లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం వద్ద నిర్దిష్ట కార్యాచరణ లేకపోవడం దారుణమన్నారు. సచివాలయాల్లో, రెవెన్యూ కార్యాలయాల్లో సీపీఐ ఆందోళనల సందర్భంగా ఇచ్చిన అర్జీలకు దుమ్మెక్కుతున్నది తప్పితే ఎంక్వయిరీ జరగలేదన్నారు. సరోజినీ నగర్, చలమారెడ్డి పల్లె వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు చేయలేదన్నారు.

లిటిల్ ఫ్లవర్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి



డీఈవో కార్యాలయ పరిపాలన అధికారి మునీర్‌కు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: బద్వేల్ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ప్రైవేట్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం.చిన్ని వీరనాల శివకుమార్ తెలిపారు. డీఈఓ కార్యాలయంలో పరిపాలన అధికారి మునీర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తోందని తెలిపారు. క్వాలిఫైడ్ టీచర్లతో కాకుండా అన్ క్వాలిఫైడ్ టీచర్లతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. ఉపాధ్యాయుడు అన్వర్ విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన అందరికీ తెలిసిందే అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నటువంటి లిటిల్ ఫ్లవర్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్, శ్రీకాంత్ వంశీ పాల్గొన్నారు.

సీఐగా బాధ్యతల స్వీకరణ

కడప అర్బన్: కడప సీసీఎస్ పోలీస్ స్టేషన్ సీఐగా కృష్ణంరాజు నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2012 బ్యాచ్‌కు చెందిన వారు కాగా కడప జిల్లా పోరుమామిళ్ల, ప్రొద్దుటూరు3 టౌన్, రాజుపాలెం, పెద్దముడియం ఎర్రగుంట్లలో ఎస్ఐగా విధులు నిర్వహించారు. 2024లో సీఐగా పదోన్నతి పొంది ముదిగుబ్బ, ఒంటిమిట్టలో పనిచేశారు. అక్కడి నుంచి బదిలీపై సీసీఎస్ సీఐగా కడపలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ దొంగతనాల నియంత్రణకు ప్రత్యేకంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తామన్నారు.

ప్రభుత్వం పునఃపరిశీలించాలి



మాట్లాడుతున్న విజయజ్యోతి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో కరవు మండలాలపై కూటమి ప్రభుత్వం పున:పరిశీలన జరపాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. నగరంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో ఆమె మాట్లాడుతూ చక్రాయపేట, వేముల, కమలాపురం, తదితర మండలాల్లో కరవు పరిస్థితులున్న వాటిని ప్రకటించలేదని తెలిపారు. రబీలో గు చేసిన మినుము, తదితర పంటలు బాగా దెబ్బతిన్నాయన్నారు. పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెడుతున్న మోడీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలన్నారు. ముస్లింల ఆస్తులను రక్షిస్తామని సీఎం చంద్రబాబు ఇటీవల హామీ ఇచ్చారని, ఆ మాట నిలబెట్టుకోవాలంటే వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి ప్రమాదమా? హత్యా? స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమావేశంలో బండి జకరయ్య, అశోక్ రెడ్డి, అబ్దుల్‌సత్తార్, మామిళ్లబాబు, చిన్న కుళ్లాయప్ప, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

ఎప్పటికీ కాంగ్రెస్ పార్టీతోనే ఉంటా



మాట్లాడుతున్న అఫ్జల్‌ఖాన్

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగర అధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి తాను రాజీనామా చేయలేదని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ స్పష్టం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తాను నగర అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు తప్పుడు లేఖను సోషల్ మీడియాలో ప్రచారం చేశారన్నారు. ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను హరించడానికే వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెడుతున్నారని ధ్వజమెత్తారు. మైనార్టీలను అణిచివేసే కుట్ర జరుగుతోందన్నారు. సవరణ బిల్లు రావడం అంటే దేశానికి బ్లాక్ డే అన్నారు. పేపర్ బ్యాలెట్‌తో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా రాహుల్‌గాంధీని ప్రధానిగా, వైఎస్.షర్మిలారెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు ముస్లింలందరూ సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హమీద్, సత్తార్, దినకర్‌రెడ్డి, కమాల్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలి



తనిఖీలు చేస్తున్న ఎస్ఐ రవికుమార్, సిబ్బంది

కడప అర్బన్: జిల్లాలో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా పోలీసు అధికారులు బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. అనుమానితులను విచారించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్ల డ్రైవర్లు సీటు బెల్టు వేసుకోవాలన్నారు. రహదారి భద్రత నియమాల ఉల్లంఘనులపై పోలీసులు చర్యలు చేపట్టారు.

మద్యం బాబుకు జైలు శిక్ష

కడప అర్బన్ : మద్యం తాగి ఆటో నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి 17 రోజుల జైలుశిక్ష విధిస్తూ కడప ఫస్ట్ స్పెషల్ కోర్టు జడ్జి తీరుచెప్పారు. ఒక్కి రవి కుమార్ గత నెల 29న మద్యం తాగి ఆటో నడుపుతున్నారు. కడప ట్రాఫిక్ పోలీసులు బ్రీత్ అనలైజర్ సాయంతో తనిఖీ చేయగా పట్టుబడ్డాడు.. విచారణలో సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో ఫస్ట్ స్పెషల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మంగళ గౌరీ శిక్ష విధించినట్లు కడప ట్రాఫిక్ సీఐ జావిద్ తెలిపారు.

పాస్టర్ మృతికి సంతాపంగా క్రొవ్వొత్తుల ప్రదర్శన



క్రొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న చర్చి సభ్యులు

కడప కార్పొరేషన్: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతికి సంతాపంగా క్రిష్టియన్ మైనార్టీలు బుధవారం క్రొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక కాంగ్రిగేషనల్ టౌన్ చర్చిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ మోహన్‌బాబు మాట్లాడుతూ మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల కడప వాసి కావడం గర్వకారణమన్నారు. ఆయన కుటుంబానికి ఆదరణ కలగాలని దేవుని ప్రార్థించారు. ప్రభుత్వం కేసులోని వాస్తవాలను వెలికితీసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సెక్రటరీ విజయుడు, నోవా బెన్నీ, ఆశీర్వాదమ్మ, సుశీలమ్మ, రాజమనోహర్, ప్రసన్న కుమార్, పులి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

జేఈఈ పరీక్షల సందడి

కడప ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్ పరీక్షలు ఏప్రిల్ 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి కనిపించింది. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు.. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆరు గంటల వరకు పరీక్ష నిర్వహించారు. నగర శివారులోని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ చివరి విడత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇందులో ఉదయం సెషన్‌కు సంబంధించి 109 మంది విద్యార్థులకు గానూ 92 మంది హాజరుకాగా 17 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం సెషన్లో 109 గాను 102 మంది హాజరు కాగా 7 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు అక్కడక్కడా లోపలికి పంపాలంటూ సిబ్బందిని బ్రతిమలాడడం కనిపించింది. బంగారు ఆభరణాలు ధరించి వచ్చిన వారిని అనుమతించకపోవడంతో విద్యార్థులను తమ తల్లిదండ్రులకు అక్కడే ఆభరణాలు తీసి ఇచ్చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసుల సహ కారంతో బుధవారం తనిఖీలు నిర్వహించారు.దీంతో పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

సాక్షి ఫొటోగ్రాఫర్



కేఓఆర్ఎం కళాశాల వద్ద చెవుల కమ్మలను తీస్తున్న విద్యార్థిని



పరీక్షకు ఆలస్యంగా రావడంతో సిబ్బందిని బ్రతిమాలుతున్న విద్యార్థులు



తల్లికి తన బంగారు ఆభరణాలు ఇస్తున్న విద్యార్థిని



విద్యార్థుల హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది



కష్టపడి చదివా.. పంపండి సారూ..



సార్ ... మమ్మల్ని పంపండి ప్లీజ్

దిమ్మెలు పగిలిపోతున్నాయ్



కడప నగరంలోని రాజీవ్ మార్గ్ రోడ్డుకు, పుట్‌పాత్‌కు మధ్య వేసిన సిమెంటు దిమ్మెలను ఆకతాయిలు పగులగొడుతున్నారు. వాహనాలు క్రమపద్ధతిలో వెళ్లడానికి, పార్కింగ్ చేయడానికి ఇవి ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రమాదవశాత్తూ ఇవి విరిగిపోయాయా? కావాలనే ఎవరైనా విరగ్గొడుతున్నారా? అన్నది సందేహంగా మారింది. కడప నగరపాలక సంస్థ ఎంతో ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఈ సిమెంటు దిమ్మెలు పగులగొడుతున్న వారిని నిఘా ఉంచాలని పలువురు కోరుతున్నారు.

– కడప కార్పొరేషన్

జిల్లాకే వన్నెతెచ్చిన గానుగపెంట

డీఆర్వో విశ్వేశ్వర నాయుడు



హనుమంతరావును సత్కరిస్తున్న డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

కడప సెవెన్‌రోడ్స్: ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావు వైఎస్సార్ కడప జిల్లాకే వన్నె తెచ్చారని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ప్రశంసించారు. స్థానిక కలెక్టరేట్‌లో విశ్వావసు నామ ఉగాది రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాన్ని హనుమంతరావు అందుకున్న సందర్భంగా బుధవారం ఆయనను సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ హనుమంతరావు ఉత్తమ ఉపాధ్యాయుడిగా, రచయితగా, పాత్రికేయుడిగా, కవయిత్రి మొల్ల సాహితీ సేవా దురంధరుడిగా, వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులుగా వివిధ కోణాలలో సేవలు చేసి, గతంలో రాష్ట్రపతిచే ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుచే సత్కారం పొందడం జిల్లాకే గర్వకారణం అన్నారు. హనుమంతరావు మాట్లాడుతూ తన నిరంతర తపన తనను ఈ స్థాయికి చేర్చిందని, రక్తబంధువుల కంటే ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఎక్కువ మంది సాహితీ బంధువులను పొందానన్నారు. ఈ కార్యక్రమములో బీసీ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు లింగమూర్తి, గోవిందనాగరాజు, కార్యవర్గ సభ్యుడు అంజి, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ ,రామ్మూర్తి నాయుడు, కోశాధికారి నూనె నాగేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, ఉపాధ్యక్షులు పెండ్లిమర్రి మల్లయ్య, రాధాకృష్ణ, మొల్ల సాహిత్య పీఠం మహిళా విభాగం కార్యదర్శి కొండూరు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై చంద్రబాబు వ్యాఖ్యలు సరికావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్. శివరామ్

కడప కార్పొరేషన్: బడుగు, బలహీన వర్గాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు సరికావని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నేట్లపల్లి శివరామ్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళిత, గిరిజన, బహుజన, మైనార్టీలపై దాడులు, దౌర్జన్యాలు చేస్తూ అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారన్నారు. అధికార పార్టీ అక్రమాలను ప్రశ్నించినందుకే అనంతపురంలో బలహీన వర్గానికి చెందిన లింగమయ్యను అతి దారుణంగా హత్య చేశారన్నారు. ఇదొక్కటే కాదు ప్రతిరోజూ రాష్ట్రంలో ఏదో ఒకచోట దళిత, గిరిజన, బహుజనులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. బీసీ కులానికి చెందిన కడప మేయర్ పదవీచ్యుతుడిని చేసేందుకు కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఉగాది రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు బీసీలపై ఆయనకున్న చులకన భావాన్ని తెలుపుతున్నాయన్నారు. బీసీల ఆలోచనలు ఏపూటకు ఆ పూటేనని, ఎవరు చెప్పినా వారు వినరని మాట్లాడటం దారుణమన్నారు. అనేక సందర్భాలలో చంద్రబాబు బీసీలపై తనకున్న అసహనాన్ని వ్యక్తం చేశారని గుర్తు చేశారు. హామీలు నెరవేర్చమన్నందుకు నాయీ బ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానని బెదిరించారని, ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని మాట్లాడారని తెలిపారు. పార్టీల జెండాలు మోసి మోసి బీసీల భుజాలు కాయలు కట్టాయని, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉండాలో నిర్ణయించేది బీసీలేనని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. బీసీలను రాజ్యసభకు పంపిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు బసవరాజు, కె. శివయాదవ్, గంగరాజు, వెంకటేశ్వర్లు, రవికుమార్ యాదవ్, షిండే రవిచంద్ర, పార్వతీశం, నరసయ్య, బి. సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మానసిక వేదనతో వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్: కడప నగరంలోని మారుతీనగర్‌లో నివాసముంటున్న బాబ్జీ (32) అనే వ్యక్తి మానసిక వేదనతో ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనపై కడప వన్‌టౌన్ పోలీసులు విచారించిన ప్రాథమిక సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి. నగరానికి చెందిన బాబ్జీ, రేష్మా అనే మహిళను 12 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. ఐదేళ్ల కిందట భర్తతో గొడవపడి రేష్మా తన పిల్లలతోపాటు పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో బాబ్జీ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప వన్‌టౌన్ పోలీసులు తెలియజేశారు.